సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు కేటాయించాలి


మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉస్మాన్ బిన్ మహ్మద్ హాజిరి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని ప్రార్థన స్థలాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.50 లక్షల నిధులు కేటాయించాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ హాజిరి కోరారు. ఈ మేరకు ఆయన టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో ఆలయాలు, మసీదులు ఎన్నో ఉన్నాయని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆలయాల నిర్వాహకులు సొంతంగా డబ్బులు పెట్టి కెమెరాల ఏర్పాటు కృషి చేసుకునే ఆర్థిక స్థోమత లేని వారని అన్నారు. కాగా ఈ విషయంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రితో మాట్లాడతానని టీపీసీసీ అధ్యక్షుడు హామీ ఇచ్చారు.

అన్నదానం



గోల్కొండ: షేక్‌పేట్ కట్టమైసమ్మ ఆలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మారుతీనగర్, వివేకానందనగర్ తదితర ప్రాంతాల నుంచి మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున ఈ అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పూస వేణుగోపాల్, ఏ.మాణిక్‌ప్రభు, వి.ప్రమోద్, భిక్షపతి, అశోక్, ప్రభాకర్, ఊర్మిల, సబిత, రేఖ తదితరులున్నారు.

షేక్‌పేట్ ఫ్లై ఓవర్‌కు కొత్త సొబగులు


షేక్‌పేట్ ఫ్లై ఓవర్ కింద ఏర్పాటు అవుతున్న గుర్రాల బొమ్మలు

గోల్కొండ: షేక్‌పేట్ ఫ్లై ఓవర్ సరికొత్త అందాలను సంతరించుకుంటుంది. నగరంలోని ఫ్లై ఓవర్లు, వాటి పిల్లర్లను సుందరీకరించే పనిలో భాగంగా షేక్‌పేట్ పాస్‌పోర్టు సేవా కేంద్రం ముందు ఉన్న ఫ్లై ఓవర్ కూడా నూతన సొబగులు సంతరించుకుంటుంది. ఫ్లై ఓవర్ పిల్లర్లకు ఆకట్టుకునే రంగులు వేశారు. అంతేకాకుండా ఫ్లై ఓవర్ కింది భాగంలో మూడు గుర్రాల బొమ్మలు ఏర్పాటు చేశారు. వెండిలా మెరిసిపోతున్న ఈ గుర్రాల చుట్టూ అందమైన ఫ్లడ్ లైట్లు, ఫౌంటెన్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే వారం వీటిని ప్రారంభించనున్నారని తెలిసింది.

వేగవంతంగా యూడైస్ తనిఖీలు


వివిధ పాఠశాలల యూడైస్ ఫామ్‌లను పరిశీలిస్తున్న డిప్యూటీ ఐవోఎస్ మక్బూల్ అహ్మద్

గోల్కొండ: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యలు తమతమ పాఠశాలలకు చెందిన యూడైస్ ప్లస్‌ను పూర్తి చేసి తమ కార్యాలయంలో సమర్పించాలని గోల్కొండ మండల డిప్యూటీ ఐవోఎస్ మహ్మద్ మక్బూల్ అహ్మద్ అన్నారు. సోమవారం గోల్కొండ ఖాజీగల్లిలోని తన కార్యాలయంలో ఆయన పలు ప్రైవేటు పాఠశాలల వారితో మాట్లాడారు. అనంతరం ఆయన ఆయా పాఠశాలలకు చెందిన రిజిస్ట్రార్‌లు, యూడైస్ ప్లస్ ప్రతులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి పేరు యూడైస్ ప్లస్‌లో ఉండాలని అంతేకాకుండా ప్రతి విద్యార్థికి ప్రభుత్వం ఇస్తున్న పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ కూడా ఉండేలా చూడాలని ఆయన అన్నారు.

నేడు బాపూఘాట్‌లో కృతజ్ఞత సభ



లంగర్‌హౌస్: సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమాలను నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నామని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ అన్నారు. సోమవారం ఆయన లంగర్‌హౌస్ బాపూఘాట్‌లో పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ..గుజరాత్‌లోని పటేల్ విగ్రహం తరహాలో బాపూఘాట్‌లో మహాత్మా గాంధీ విగ్రహాన్ని నిర్మిస్తామని తీర్మానం చేయడం చాలా సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో బాపూఘాట్‌తో పాటు అన్ని జిల్లాల్లో గాంధీ విగ్రహాల వద్ద కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌లో సుమారు 400 మంది చిన్నారులతో గాంధీజీ వేషధారణలో ప్రదర్శన ఉంటుందన్నారు.

టపాసుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి


సయ్యద్ ఫయాజ్, ఏసీపీ

గోల్కొండ: టపాసులు అమ్మే వ్యాపారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ముఖ్యంగా అనుమతి ఉన్న వారే టపాసులు అమ్మాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా టపాసుల స్టాల్స్ ఇరుకైన, వెలుగులేని ప్రాంతాల్లో ఏర్పాటు చేయరాదని ఆయన అన్నారు. ప్రమాదవశాత్తు టపాసుల షాపుల వద్ద అగ్నిప్రమాదం చోటు చేసుకుంటే వెంటనే పోలీసులకు, అగ్నిమాపక శాఖ వారికి తెలపాలన్నారు. టపాసులను భవనాలలోని సెల్లార్స్, మూసి ఉన్న గదుల్లో స్టోర్ చేయకూడదన్నారు.

బేగంబజార్.. ఫైర్‌తో బేజార్



- హోల్‌సేల్ టపాసుల దుకాణాలతో భయం భయం
- ఇరుకైన దుకాణాలతో ఆందోళన చెందుతున్న స్థానికులు
- ఎన్నిసార్లు ప్రమాదాలు సంభవించినా పట్టించుకోని ఫైర్, పోలీసు, జీహెచ్‌ఎంసీ అధికారులు

అబిడ్స్: హోల్‌సేల్ టపాసుల దుకాణాలతో బేగంబజార్ పరిసర ప్రాంతాల్లో స్థానిక ప్రజలు భయం భయంగా బతుకుతున్నారు. ఎన్నో ప్రమాదాలు సంభవించినా ఫైర్, పోలీస్, జీహెచ్‌ఎంసీ, ఇతర శాఖల అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. నగరంలోనే టపాసుల హోల్‌సేల్ దుకాణాలకు ప్రసిద్ధిగాంచిన బేగంబజార్, ఫీల్‌ఖానా, ఉస్మాన్‌గంజ్, ఛత్రి, సిద్దిఅంబర్‌బజార్ ప్రాంతాల్లో ఉన్న దుకాణాలు ప్రజలకు ప్రాణ సంకటంగా మారాయి. నిత్యం ట్రాఫిక్ రద్దీతో ఉండే ఈ ప్రాంతాల్లో ఇరుకైన టపాసుల హోల్‌సేల్ దుకాణాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గతంలో పలుసార్లు టపాకాయల హోల్‌సేల్ దుకాణాల్లో ప్రమాదాలు సంభవించినా అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు.

తాజాగా బొగ్గులకుంటతో..

తాజాగా అబిడ్స్ బొగ్గులకుంట ప్రాంతంలో పెద్ద ఎత్తున హోల్‌సేల్ టపాసుల దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించడంతో స్థానిక ప్రజలే కాక నగర వ్యాప్తంగా ప్రజలు ఉలిక్కిపడ్డారు. వాహనాలు దగ్ధమైనప్పటికీ పెను ప్రమాదం సంభవించకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బొగ్గులకుంట ఘటనతోనైనా అధికారుల్లో చలనం వస్తుందా అని అందురు ఎదురు చూస్తున్నారు. బేగంబజార్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హోల్‌సేల్ దుకాణాలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడైనా ప్రమాదం సంభవిస్తే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇరుకైన దుకాణాలలో టన్నుల కొద్ది టపాసులు నిల్వ ఉంచుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి అడ్డగోలుగా దుకాణాల్లో వేల కిలోలకొద్ది టపాసులు నిల్వ ఉంచడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

దుకాణాలపై చర్యలు తీసుకోవాలి..



హైడ్రా కమిషనర్ రంగనాథ్, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, పోలీస్ నగర కమిషనర్ సీవీ ఆనంద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లింబాద్రి, ఇతర శాఖల ఉన్నతాధికారులు బేగంబజార్, ఫీల్‌ఖానా, ఛత్రి, ఉస్మాన్‌గంజ్ ప్రాంతాల్లో పర్యటించి నిబంధనలు పాటించని హోల్‌సేల్ టపాకాయల దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజలకు ప్రాణసంకటంగా మారిన ఈ టపాకాయల హోల్‌సేల్ దుకాణాలు ఏ ఒక్క కొనుగోలు దారుడికి ఒరిజినల్ బిల్లులు మాత్రం ఇవ్వడం లేదు. ప్రభుత్వ జీఎస్టీ ఆదాయానికి గండికొడుతున్న ఈ దుకాణాలపై వెంటనే దాడులు చేస్తే వారి అక్రమాలు బయటపడుతాయి. జీఎస్టీ అధికారులు నామమాత్రం దాడులు కూడా చేయడం లేదు.

ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు, బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు

మూడేళ్ల కిందట ఛత్రి చౌరస్తాలో పెను ప్రమాదం..

బేగంబజార్ ఛత్రి చౌరస్తాలో మూడేళ్ల క్రితమే హోల్‌సేల్ టపాసుల దుకాణంలో పెద్ద ఎత్తున అగ్నిప్రమాదం సంభవించింది. అప్పట్లో ఆ దుకాణంపై అధికారులు నామమాత్రం చర్యలు తీసుకున్నారు. తిరిగి అదే ప్రాంతంలో ప్రస్తుతం హోల్‌సేల్ దుకాణం కొనసాగుతుంది. ఇలా బేగంబజార్ పరిసరాల్లో ఉన్న హోల్‌సేల్ దుకాణాలను బహిరంగ ప్రాంతాలకు తరలిస్తే ప్రజలకు ఎంతో సేఫ్‌గా ఉంటుందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

నామమాత్రంగా ఫైర్ అధికారుల తనిఖీలు..

హోల్‌సేల్ దుకాణాలపై అగ్నిమాపక శాఖ, పోలీస్, జీహెచ్‌ఎంసీ ఇతర శాఖల అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేపడుతున్నారు. ఫైర్ అధికారులు ఫైర్‌సేఫ్టీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఆ దుకాణం పరిసరాల్లో ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలు ఆర్పేందుకు విశాలమైన రోడ్లు లేకున్నా ఫైర్ అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతి హోల్‌సేల్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలంటే దాని పరిసరాల్లో ఫైర్‌ఇంజన్ వచ్చే విధంగా విశాలమైన రోడ్లు ఉండాలి. ఇరుకైన ప్రాంతాల్లో ఉన్న హోల్‌సేల్ దుకాణాలపై ఫైర్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అదేవిధంగా స్థానిక పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు కూడా నిబంధనలు పాటించని హోల్‌సేల్ దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి పన్నులు చెల్లించడం లేదు..

హోల్‌సేల్ దుకాణాల్లో పెద్ద ఎత్తున లక్షల్లో వ్యాపారాలు కొనసాగుతున్నా.. టపాసులు కొనేవారికి బిల్లులు మాత్రం ఇవ్వడం లేదు. జీఎస్టీ కట్టాల్సి వస్తుందని బిల్లులు ఇవ్వడం లేదని పలువురు పేర్కొంటున్నారు. జీఎస్టీ అధికారులు హోల్‌సేల్ దుకాణాల వద్దకు వచ్చి తనిఖీలు చేస్తే ఎంతవరకు బిల్లులు ఇస్తున్నారో స్వయంగా అర్థమవుతుంది. బేగంబజార్, అఫ్జల్‌గంజ్, గౌలిగూడ, ఉస్మాన్‌గంజ్ కమర్షియల్ ట్యాక్స్ (జీఎస్టీ) అధికారులు లక్షలకొద్ది ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా..ఈ హోల్‌సెల్ టపాసుల వ్యాపారులపై చర్యలు తీసుకోవడం లేదు.

జిల్లా బదిలీలపై మంత్రికి సారథి కళాకారుల వినతి


వినతిపత్రాన్ని అందజేస్తున్న కళాకారులు జిల్లా నాగేశ్వరరావు, యశపాల్

నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించిన తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి కళాకారులు సోమవారం మంత్రి జూపల్లి కృష్ణారావుకు జిల్లాల బదిలీలతో ఇబ్బంది పడుతున్నామంటూ వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన మంత్రి ఈ సమస్యను పరిష్కరించాలని సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణకు సూచించారు. ప్రభుత్వ పథకాలపై కళాజాత ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల బదిలీలతో ఇబ్బంది పడుతున్న సారథి కళాకారులు కొప్పర్తి సురేందర్, పమ్మిరవి, యశ్‌పాల్, జిల్లా నాగేశ్వరరావు, గోవింద గురవయ్య, నట్ల అంజలి, గొల్లపల్లి శిరీష, రామంచ సురేష్, కుమ్మరి శ్రావణ్, పన్నీరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన వారిని ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారి సమస్యలను విన్నారు. మరికొందరు తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంకా మంజూరు కాలేదని ఆయన ముందు తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. సరైన ధ్రువపత్రాలు సమర్పించని వారికి ఇంకేదైనా సాంకేతిక కారణాల వల్ల కొన్ని సంక్షేమ పథకాలకు మంజూరు లభించలేదని ఆయన అన్నారు. సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా ముందు ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు తమ ప్రాంతంలోని అంతర్గత రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని రోడ్లకు మరమ్మతులు చేయించాలని పలువురు ఆయనను కోరారు. ఆయన వెంట కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్ సమీనా బేగం

యాకుత్‌పురా: అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యమిస్తూ అనేక ప్రాంతాల్లో కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. తలాబ్ చంచలం డివిజన్‌లోని చాచాగ్యారేజ్, తలాబ్‌కట్టా రైల్వే ట్రాక్ ప్రాంతాల్లో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం ఆయన కార్పొరేటర్ సమీనా బేగం, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తమవంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీ అధ్యక్షులు, నాయకులు, పలు విభాగాల ఆధికారులు పాల్గొన్నారు.

వాగ్దానాలు మరిచిన కేంద్రం


మహాసభలో పాల్గొన్న నాయకులు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట జోన్ సీపీఎం 4వ మహాసభను జంగమ్మెట్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకురాలు ఎం.లక్ష్మమ్మ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మూడు సంవత్సరాల నివేదికను పార్టీ నాయకుడు కోటయ్య ప్రవేశపెట్టగా దానిపై సభ్యులు చర్చించి ఆమోదించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.డి. అబ్బాస్, కార్యదర్శి వర్గ సభ్యులు జి.విటల్, మీనా మాట్లాడుతూ..దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను గెలిచాక తుంగలో తొక్కారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రావణ్ కుమార్, తిరుపతి, కృష్ణమోహన్, ఫర్హానా, లక్ష్మి, హష్మీ, సుధాకర్, సోమన్న, చిన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..


నూతనంగా ఎన్నికైన కిషన్

ఈ సందర్భంగా సీపీఎం చాంద్రాయణగుట్ట జోన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జోన్ కార్యదర్శిగా ఎస్.కిషన్, సభ్యులుగా లక్ష్మమ్మ, కోటయ్య, కృష్ణ, రాంకుమార్, శ్రీను, స్వామి, జ్యోతి, మేరాజ్, అఫ్జల్ బేగం, వెంకట్రామ్, ఆంజనేయులు ఎన్నికయ్యారు.

రోడ్లకు మరమ్మతులు


గుంతలను పూడ్చుతున్న బల్దియా సిబ్బంది

నాంపల్లి: ఇటీవల కురిసిన వర్షానికి పాడైన రోడ్లకు బల్దియా సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. రోడ్ల మీద పడిన గుంతలను తారుతో పూడ్చివేశారు. సోమవారం నాంపల్లి నియోజకవర్గం ఆసిఫ్‌నగర్ డివిజన్‌లోని ఇందిరానగర్ మురికివాడలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. బస్తీ కమ్యూనిటీ హాల్ వెనుక వైపు ఉన్న వీధిలో గుంతలు పడిన రోడ్డు మీద ప్రజలు ప్రయాణించలేక ఇబ్బందులు పడ్డారు. గుంతల రోడ్డును సరిచేసిన జీహెచ్‌ఎంసీ సిబ్బందికి స్థానిక బస్తీ నేతలు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆకట్టుకున్న 'జేబు చెప్పిన ఊసులు'



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాటక రంగ సంస్థ రసరంజని ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో ప్రదర్శించిన 'జేబు చెప్పిన ఊసులు' నాటకం ఆహుతులను ఆకట్టుకుంది. ప్రముఖ నాటకరంగ దర్శకులు మంజునాథ దర్శకత్వంలో మనిషి ఎలా బతకాలో, ఎలా బతకకూడదో తెలియజెప్పే వాస్తవ సంఘటనలతో సాగిన నాటకం ఆలోచింప చేసింది. ఈ కార్యక్రమంలో రసరంజని ఉపాధ్యక్షులు రామ కోటేశ్వర్‌రావు, కార్యదర్శి నటరాజ్, కోశాధికారి సేనాపతి, రచయిత స్నిగ్ధ తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ అంబటి లక్ష్మణ్‌రావు సేవలు చిరస్మరణీయం


నివాళులర్పిస్తున్న జస్టిస్ చంద్రయ్య

నాంపల్లి: అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ డాక్టర్ అంబటి లక్ష్మణ్‌రావు సంస్మరణ సభ సోమవారం రాత్రి మాసాబ్‌ట్యాంక్‌లోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో జరిగింది. హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జస్టిస్ డాక్టర్ అంబటి లక్ష్మణ్‌రావు చిత్రపటానికి ఆయన నివాళులర్పించి ప్రసంగించారు. రెడ్‌క్రాస్ సొసైటీకి జస్టిస్ లక్ష్మణ్‌రావు చేసిన సేవలను గుర్తు చేశారు. జస్టిస్ లక్ష్మణ్‌రావు సేవలు చిరస్మరణీయమని కీర్తించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ భీమ్‌రెడ్డి, సభ్యులు జి.వెంకటేష్, రవికుమార్, శాస్త్రి ప్రవీణ్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

హన్మంతరావును కలిసిన మిత్రకృష్ణ



జియాగూడ: మాజీ రాజ్య సభ్యుడు వి.హన్మంతరావు జీవితం మీద రూపొందించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరై ఆయనను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ కలిసి అభినందించారు. ఢిల్లీలో జరిగిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి మిత్రకృష్ణతో పాటు నాయకులు జె.రవీందర్, అభిషేక్, వెంకట్, సంతోష్, ఉమేష్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నాలా పైకప్పు నిర్మాణాన్ని వెంటనే చేపట్టండి


జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అఫ్జల్‌గంజ్: గోషామహల్ చాక్నవాడిలో కుప్పకూలిన నాలా పైకప్పు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. నాలా పైకప్పు కూలి వారం రోజులు గడుస్తున్నా నిర్మాణాల పనులు ఇంకా ప్రారంభించలేదని ఆయన పేర్కొన్నారు. సోమవారం ట్యాంక్‌బండ్ వద్ద జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డికి గోషామహల్ 14వ సర్కిల్ ఇంజినీరింగ్ అధికారులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. చాక్నవాడి ప్రాంతంలో రెండేళ్ల క్రితం నాలా పైకప్పు నేల కూలిందని తిరిగి సమీపంలో మరోసారి నాలా నేల కూలినా అధికారులు చర్యలు చేపట్టడం లేదన్నారు. గోషామహల్ దారుసలాం నుంచి చాక్నవాడి వరకు నాలాపై భారీ వాహనాల రాకపోకలను నిలిపి వేయాలని ఆయన డిమాండ్ చేశారు. భారీ వాహనాల రాకపోకలతోనే నాలా పైకప్పులు కూలుతున్నాయన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి స్పందించారు. వెంటనే గోషామహల్ చాక్నవాడి నాలా పైకప్పు నిర్మించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎస్‌కే సమాజ్ దసరా సమ్మేళనం


దసరా సమ్మేళనంలో నగరి లక్ష్మి, కోనేరి చంద్రస, పూజారి రాజేశ్వర్ తదితరులు

అఫ్జల్‌గంజ్: ధూల్‌పేట రహింపురా ఎస్ఎస్‌కే సమాజ్ వారు దసరా సమ్మేళన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తమ తమ విద్యాసంస్థల్లో పలు పోటీల్లో నిర్వహించిన విద్యార్థులకు ఎస్ఎస్సీ నుంచి పీజీ వరకు మెరిట్ విద్యార్థులకు అవార్డులు అందజేశారు. 222 మంది బాల బాలికలకు ముఖ్యఅతిథులు నగరి లక్ష్మి, కోనేరి చంద్రస, అడ్వైజర్ పూజారి రాజేశ్వర్ అవార్డు ప్రైజ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌కే సమాజ్ అభివృద్ధి పట్ల, విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్.కుమార్, అశోక్ చౌహాన్, విఠల్, నగరి సురేందర్, చౌహాన్, యశ్వంత్, నర్సింగ్‌రావు, రతన్ మహేష్, గణేష్ పవర్, కొత్త రవి తదితరులు పాల్గొన్నారు.